

గొల్లపుంత కాలనీలో ఇళ్ల ప్లాను పరిశీలిస్తున్న కన్నబాబు

# బహిరంగ మలమూత్ర విసర్జన రహిత రాష్ట్రంగా ప్రథమం

**మండపేట:** బహిరంగ మలమూత్ర విసర్జన రహిత రాష్ట్రంగా దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానం దక్కించుకోనుందని డైరక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(డి.ఎం.ఎ) కన్న బాబు పేర్కొన్నారు. శనివారం మండపేటలో ఆకస్మికంగా పర్యటించిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునే స్థలం లేనివారికి సామూహిక మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి నాటికి బహిరంగమలమూత్ర విసర్జన రాష్ట్రంగా ప్రకటించనున్నట్లు తెలిపారు. ఇక నుంచి ఎవరైనా బహిరంగంగా మలమూత్ర విసర్జనకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. సోమవారం నుంచి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో కాగితం రహిత పాలన(ఈ-ఆఫీస్) కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. వనం మనం కార్యక్రమంలో రాష్ట్రంలో 27 లక్షల మొక్కలు నాటగా లక్ష మొక్కలకు జియో ట్యాగింగ్ చేశామన్నారు. ఎక్కడైనా మొక్కలు చనిపోతే వాటి స్థానంలో మరో మొక్క నాటేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా వేగుళ్ల వీర్రాజు(గొల్లపుంత) కాలనీలో పర్యటించి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో ఇళ్లు నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి మున్సిపాలిటీ ప్రగతిపై విచారించి తగిన సూచనలు చేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ వీవీ కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.